సమాచారం

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 60, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 33, క్యాప్సికమ్ 48, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 19, దోసకాయ 40, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 18, చామగడ్డ 65, మొరంగడ్డ 15, కందగడ్డ 40, సొరకాయ 26, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

వి మేక్ స్కాలర్స్ ఆధ్వర్యంలో ఎక్స్‌పో

సాక్షి, సిటీబ్యూరో: సరైన అర్హతలు ఉంటే ఆర్థిక సమస్యలతో విదేశీ విద్యను దూరం చేసుకోవాల్సిన అవసరం లేదని పలువురు విద్యా రంగ నిపుణులు అన్నారు. ప్రముఖ విదేశీ విద్యారంగ సేవా సంస్థ ఉయ్ మేక్ స్కాలర్స్ ఆధ్వర్యంలో బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో సేఫ్ 2023 పేరిట సదస్సు, ఎక్స్‌పో నిర్వహించారు.ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు దామిని మహాజన్ మాట్లాడుతూ.. ఆర్థిక అవరోధాల కారణంగా విద్యార్థి తమ విదేశీ విద్య కలను వదులుకోకూడదనే లక్ష్యంతో దీన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ ఐటీ మంత్రిత్వ శాఖ తమ డిజిటల్ ఇండియా ప్రచారంలో భాగంగా సహకరిస్తోందన్నారు. ఒకేరోజు దాదాపు 1000 మంది విద్యార్థులకు విద్యా రుణాలను మంజూరు చేయడానికి సూత్రప్రాయంగా అంగీకరించడం గొప్ప విషయమన్నారు.

క్లుప్తంగా...

'టాట్' శిక్షణకు ప్రొ. వెంకటేశ్వర్లు ఎంపిక


ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న పద్మావతి

సనత్‌నగర్: యువత విద్య, ఉపాధి అవకాశాలపై దేశవ్యాప్త సర్వే చేయడం కోసం బుధవారం ఢిల్లీలో నిర్వహించనున్న ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ (టాట్) శిక్షణ కార్యక్రమానికి బేగంపేట మహిళా కళాశాలకు చెందిన డాక్టర్ వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి 70 మంది ఎన్ఎస్ఎస్ అధికారులు ఎంపిక కాగా తెలంగాణ నుంచి 10 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. మంగళవారం డాక్టర్ కే వెంకటేశ్వర్లుకు ఆమె ఎంపిక పత్రాన్ని అందజేశారు. టాట్ ద్వారా శిక్షణ పొందిన ఎన్ఎస్ఎస్ అధికారులు రాష్ట్రంలో సర్వే నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారని ఆమె తెలిపారు.

సుభాషిణికి డాక్టరేట్



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన న్యాయవాది సుభాషిణి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. లీగల్ ప్రొటెక్షన్ టు గర్ల్‌చైల్డ్ ఇన్ ఇండియా అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఓయూ లా డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో ఈ పరిశోధన చేసి పీహెచ్‌డీ అందుకున్నారు. బాలికల స్థితిగతులపై చేసిన పరిశోధనకు ఓయూ నుంచి డాక్టరేట్ పొందడం సంతోషంగా ఉందని సుభాషిణి పేర్కొన్నారు.

బోగస్ ఓట్లు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఆరో వార్డు బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ ఈ బోర్డు ఎన్నికల్లో బీఎల్‌ఓల సాయంతో బోగస్ ఓట్లు నమోదు చేసినట్లు బీజేపీ నేత బానుక మల్లికార్జున్ ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోగస్ ఓట్లు నమోదు చేయించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు వెయ్యి బోగస్ ఓట్లు నమోదు చేయించగా తాము మూడు వందల వరకు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫొటోలు తీసిన యువకుడికి జైలు


రాజేష్

అమీర్‌పేట: మద్యం తాగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫొటోలు, వీడియోలు తీసిన యువకుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్ బస్తీకి చెందిన రాజేష్ అతిగా మద్యం తాగి స్టేషన్‌కు వచ్చాడు. వివిధ కారణాలతో స్టేషన్‌కు వచ్చిన వారితో పాటు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు, వీడియోలు తీశాడు. పోలీసులు వారిస్తున్నా పట్టించుకోలేదు. దీంతో రాజేష్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా నాంపల్లి 10 ఎంఎం స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రెండ్రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.



కూల్‌కూల్ స్విమ్మింగ్ పూల్

- సనత్‌నగర్‌లో పునః ప్రారంభమైన ఈత కొలను
- క్యూ కడుతున్న ఈత ప్రియులు

సనత్‌నగర్: భానుడు భగభగమంటున్నాడు.. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు నగరవాసులు 'చల్లని' మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్విమ్మింగ్‌పూల్ (ఈత కొలను) అందుబాటులోకి రావడంతో ఈత ప్రియుల ఆనందానికి అవధుల్లేవు. చలికాలంలో మూడు నెలల పాటు మూసివేసి ఉన్న ఈత కొలనును వేసవి సమీపించడంతో పునఃప్రారంభించారు. ప్రతి ఏడాది ఏదో ఒక కారణంతో ప్రారంభ ప్రక్రియలో జాప్యం జరుగుతూ వస్తుండగా ఈ సారి కాస్తా ముందస్తుగానే అందుబాటులోకి తీసుకురావడంతో స్విమ్మింగ్ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

5.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో..

5.50 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం (సుమారు 160 ట్యాంక్‌లు) ఉన్న స్విమ్మింగ్‌పూల్‌ను గత రెండు నెలలుగా ఇక్కడి బోర్ నీటితో పాటు జలమండలి సరఫరా చేసే ట్యాంకర్ల నీటితో నింపుతున్నారు. సామర్థ్యానికి తగ్గట్టుగా స్విమ్మింగ్‌పూల్‌ను పూర్తిగా నీటితో నింపడంతో పాటు ఇక్కడికి ఈత కోసం వచ్చే వారు స్నానాలు చేయడం కోసం బ్యాలెన్సింగ్ ట్యాంక్‌ను సైతం 50వేల లీటర్ల నీటితో నింపి సిద్ధం చేశారు. ఇందుకోసం వాటర్‌వర్క్స్ విభాగం నీటిని సరఫరా చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు స్విమ్మింగ్‌పూల్ ఇన్‌చార్జి వీరానంద్ తెలిపారు.


శిక్షణలో చిన్నారులు

బ్యాచ్‌ల వారీగా..

రోజుకు ఎనిమిది బ్యాచ్‌ల చొప్పున స్విమ్మింగ్‌పూల్‌ను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, 7–8, 8–9, 9–10, 10–11 వరకు ఐదు బ్యాచ్‌లు ఉంటాయి. మధ్యాహ్నం 3–4 గంటల వరకు, 4–5, 5–6 వరకు మూడు బ్యాచ్‌ల్లో శిక్షణ ఉంటుంది. అయితే మధ్యాహ్నం 3–4 గంటల వరకు కొనసాగే బ్యాచ్ మాత్రం కేవలం మహిళలకే పరిమితం చేశారు. ఒక్కో బ్యాచ్‌కు 50–60 మందిని మాత్రమే అనుమతిస్తారు. ఔత్సాహికులు www.ghmc.gov.in/sports వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నెలవారీ ఫీజు రూ.500లుగా నిర్ణయించారు. స్విమ్మింగ్‌కు వచ్చేవారు వైద్యుడు ధ్రువీకరించిన మెడికల్ సర్టిఫికెట్‌ను జతచేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఆత్మీయ సమావేశాలను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: డివిజన్ల వారీగా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాలను నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సనత్‌నగర్ నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన మోండా మార్కెట్, 23న రాంగోపాల్‌పేట, 25న బేగంపేట, 27న అమీర్‌పేట, 29న సనత్‌నగర్, ఏప్రిల్ 2న బన్సీలాల్‌పేట డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అదే విధంగా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి గృహలక్ష్మీ కార్యక్రమం కింద రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారని దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు రానున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందల కోట్ల రూపాయల అభివృద్ధితో పాటు దీర్ఘకాలికంగా ఉన్న అనేక సమస్యలను కూడా పరిష్కరించామన్నారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు అత్తెలి అరుణగౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీహరి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, పవన్‌కుమార్, హన్మంతరావు పాల్గొన్నారు.

ఈ నెల 19న సర్వసభ్య సమావేశం..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం ఈ నెల 19 వ తేదీన నిర్వహించడం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యుడు పాండు యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ సమావేశమయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ, పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

'సమస్యల పరిష్కారంలో మంత్రి విఫలం'


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

పద్మారావునగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విఫలమయ్యారని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ కట్టెలమండి ప్రాంతంలో సాగుతున్న రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రోజుల తరబడి నుంచి రోడ్డు పనులు నత్తనడక సాగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఓ వైపు డ్రైనేజీ మురికినీరు, మరో వైపు కలుషిత జలాల సమస్యతో స్థానికులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావన్నారు. రోజుల తరబడి నుంచి రోడ్డు సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మంత్రికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కట్టెల మండి ప్రాంతంలో రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్‌కుమార్, స్పందన, కిరీటీ, గుంటి సత్యనారాయణ, చంద్రపాల్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆస్పత్రికి ఫ్రిజ్, టీవీ వితరణ

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని నాగెల్లి దుర్గయ్య స్మారక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రముఖ వ్యాపారి భద్రేష్ షా, తన తండ్రి దివంగత అమ్రిత్ లాల్ జ్ఞాపకార్థం ఫ్రిజ్, టీవీని అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్, దాత భద్రేష్ షా మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అన్న సంకల్పంతో ప్రతి ఒక్కరు ముందు వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆస్పత్రికి ఫ్రిజ్, టీవీను అందించడం పట్ల కార్పొరేటర్ భద్రేష్ షాను అభినందించారు.

వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం


అధికారులు, కార్పొరేటర్‌తో చర్చిస్తున్న జీఎం రమణారెడ్డి

చిలకలగూడ : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు జలమండలి మారేడుపల్లి జీఎం రమణారెడ్డి తెలిపారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ సెక్షన్ కార్యాలయంలో కార్పొరేటర్ సామల హేమ, జలమండలి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న బస్తీలు, కాలనీలకు ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. పాడైన పవర్‌బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను సూచించారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, కలుషిత జలాల సరఫరా, లోప్రెషర్ సమస్యలను పరిష్కరించాలన్నారు. రానున్న రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు సరఫరా చేయాలని కార్పొరేటర్ హేమ కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్లు నవ్య, అన్విత్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు


శిబిరాన్ని సందర్శించిన సోమ భరత్‌కుమార్

లాలాపేట: విజయ డెయిరీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. లాలాపేటలోని డెయిరీలో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా ప్రారంభించగా చైర్మన్ సోమ భరత్‌కుమార్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి వేర్వేరుగా సందర్శించారు. కార్మికులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రెండవ విడత కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంలు మల్లయ్య, కామేష్, మల్లికార్జున్, డెయిరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్యలక్ష్మీ, విజయ్‌కుమార్, యాదగిరి, వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

విపత్తుల నుంచి కాపాడుకోవడంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

సనత్‌నగర్: విపత్తులు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సి చర్యలపై డీఆర్ఎఫ్ సిబ్బంది మంగళవారం పలు విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు. బేగంపేటలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, నేషనల్ హైస్కూల్‌తో పాటు బల్కంపేటలోని హోలీక్రాస్ హైస్కూళ్లలో అగ్నిప్రమాదాలు, వరదలు, భూకంపాలు వంటి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ఆయా సందర్భాల్లో డీఆర్ఎఫ్ సిబ్బంది నిర్వహించే రెస్క్యూ ఆపరేషన్‌లో వినియోగించే వస్తువులను ప్రదర్శించి వాటి పనితీరును వివరించారు.

గుడిసెల తొలగింపు.. స్వల్ప ఉద్రిక్తత


గుడిసెలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: ఏడాది నుంచి నోటీసులు ఇస్తున్నప్పటికీ స్పందించకపోవడంతో అక్రమ గుడిసెలను తొలగించినట్లు మారేడుపల్లి తహసీల్దార్ మాధవి రెడ్డి తెలిపారు. అడ్డగుట్ట డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో కొంతకాలంగా రోడ్డుపై అక్రమంగా వేసుకున్న ఆరు గుడిసెలను పోలీసుల సహకారంతో మంగళవారం తొలగించారు. ఈ క్రమంలో నిర్వాసితులు, అధికారులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఉన్నపలంగా గుడిసెలను కూల్చివేస్తే తాము ఎక్కడికి వెళ్లాలో చెప్పాలని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చర్యల కారణంగా కుటుంబ సభ్యులమంతా రోడ్డున పడ్డామని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాధవి రెడ్డి మాట్లాడుతూ.. ఏసీఎస్ నగర్‌లో డబుల్ బెడ్రూమ్‌ల నిర్మాణం నేపథ్యంలో అంతకు ముందు సదరు స్థలంలో నివాసం ఉన్న వారందరూ బస్తీలో నుంచి వెళ్లిపోయి ఇతర ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో ఉంటుండగా కొందరు మాత్రం స్థానికంగానే రోడ్లపై అక్రమంగా గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. సదరు గుడిసెలు తొలగించాలని అనేక మార్లు చెప్పి పలుమార్లు నోటీసులు కూడా జారీ చేసినా స్పందించకపోవడంతో తొలగించాల్సి వచ్చిందన్నారు. వీరందరికీ ఇప్పటికే డబుల్ బెడ్రూమ్ మంజూరయ్యాయని త్వరలోనే ఇంటి తాళాలు అందజేస్తామని చెప్పారు. తొలగింపులో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, ఆర్ఐలు రాధిక, మల్లేశ్వర్‌రెడ్డి, సర్వేష్, ఎస్ఐలు శివరాజ్, ప్రశాంత్, పరమేశ్వరీ ఉన్నారు.

డిగ్రీ కోర్సుల ఫీజుల పెంపునకు పాలకమండలి నిర్ణయం !

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి వివిధ డిగ్రీ కోర్సుల ఫీజుల పెంపునకు పాలక మండలి (ఈసీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మంగళవారం ఓయూలో జరిగిన పాలక మండలి సమావేశంలో ఫీజుల పెంపుపై చర్చించినట్లు సమాచారం. ఫీజుల పెంపు పై గతంలో వేసిన కమిటీ నివేదిక అందగానే వచ్చే పాలక మండలి సమావేశంలో సభ్యుల ఆమోదంతో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర డిగ్రీ కోర్సుల ఫీజులను పెంచనున్నారు. ఇదిలా ఉండగా ఓయూ బడ్జెట్ పై పాలక మండలి సమావేశంలో చర్చ జరిగింది. ఈ నెల 27 జరిగే సెనెట్ సమావేశంలో సుమారు రూ.800 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఓయూ లింగ్విస్టిక్స్ విభాగం విశ్రాంత ప్రొ. అన్సారీకి రావాల్సిన వేతన బకాయిల పై చర్చ జరగలేదని తెలిసింది. గత నెల ఉద్యోగ విరమణ చేసిన ప్రొ.అన్సారీ తనకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని ఒంటరిగా దీక్ష చేపట్టగా ఈ నెల 14న జరిగే పాలక మండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారుల హామీతో దీక్ష విరమించారు.కానీ పాలక మండలి చర్చించకపోవడంతో తిరిగి ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ప్రొ.అన్సారీ పేర్కొన్నారు.

నూతన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు హామీ

రసూల్‌పురా: లాలామీయ బస్తీలో నెలకొని ఉన్న భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి త్వరలో నూతన డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ అభివద్ధి చేస్తామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకష్ణ హామీ ఇచ్చారు. మంగళవారం ఏడో వార్డు తిరుమలగిరి పెద్ద కమేళా, లాలామీయ బస్తీలో ఆయన పర్యటించగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ కబ్జా చేసి ఇళ్లను నిర్మించడంతో గత కొన్నేండ్లుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా స్థానికులు రామకష్ణ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వార్డు ఇంజినీర్ ఉమా శంకర్‌కు ఫోన్ చేసి బస్తీవాసుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యామ్నాయ భూగర్భ డ్రైనేజీ లైన్ అభివద్ధికి ప్రణాళికలు సిద్ధ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రశాంత్ ప్రభు, పవన్ కుమార్, సుధీర్, శ్రీను, బస్తీవాసులు ఉన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రశాంతంగా టీఎస్-సెట్

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష టీఎస్‌సెట్–2022 తొలిరోజు ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. మంగళవారం టీఎస్‌సెట్ కార్యాలయంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ సెట్ ప్రశ్న పత్రాలకు సంబంధించిన కోడ్‌ను విడుదల చేశారు. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాలలో రెండు విడతలుగా జరిగిన సెట్‌కు ఉదయం 80.2, మధ్యాహ్నం 83 శాతం అభ్యర్థులు హాజరైనట్లు ప్రొ.మురళీకృష్ణ పేర్కొన్నారు.

అభ్యర్థుల ఆందోళన..

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపకుల అర్హత పరీక్ష టీఎస్‌సెట్–2022 తొలిరోజు గందరగోళం నడుమ ప్రారంభమైంది. కార్యదర్శి ప్రొ.మురళీ కృష్ణ పరీక్ష నియమ నిబంధనల గురించి పూర్తి సమాచారాన్ని అభ్యర్థులకు చేరవేయకపోవడంతో వందలాది మంది సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారు. నాచారం, మల్లాపూర్ సెంటర్లలో అనేక మంది అభ్యర్థులను అధికారుల అనుమతించలేదు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే చేరుకున్నా అధికారులు అడ్డుకున్నారు. దీంతో అభ్యర్థులు ఓయూ క్యాంపస్‌లోని టీఎస్‌సెట్–2022 సభ్య కార్యదర్శి ప్రొ.మురళీకృష్ణకు విషయం చెప్పేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకొని దాడి చేశారని అభ్యర్థులు ఆరోపించారు.

యోగాతో గర్భిణులకు ఎంతో మేలు

డీఎంహెచ్‌ఓ వెంకటి


మహిళలతో కలిసి యోగా చేస్తున్న వెంకటి

అడ్డగుట్ట: యోగా చేయడంతో గర్భిణులకు ఎంతో మేలు చేకూరుతుందని హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ వెంకటి అన్నారు. హెల్త్ ఆయుష్మాన్ భారత్ మేళాను పురస్కరించుకొని మంగళవారం అడ్డగుట్టలోని ఆరోగ్య కేంద్రంలో గర్భిణులతో యోగా చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు నిత్యం యోగా చేస్తే సాధారణ ప్రసవం అయ్యే అవకాశాలు ఉంటాయని, అదే విధంగా ఒత్తిడిని కూడా తగ్గుతుందన్నారు. అనంతరం టీబీ గురించి వివరించి నిరంతరం దగ్గుతో ఇబ్బంది పడుతున్న వారు తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతుందని కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు.

మహిళలు క్రీడల్లోనూ రాణించాలి

అమీర్‌పేట: మహిళలు క్రీడల పట్ల ఆసక్తిని చూపాలని అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ అన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా మంగళవారం అమీర్‌పేట మున్సిపల్ మైదానంలో మహిళలకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. బీజేపీ మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ పోటీలను ప్రారంభించగా గెలుపొందిన క్రీడాకారులతో పాటు ఉత్తమ క్రీడాకారులకు కార్పొరేటర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, పోచప్ప పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులతో సరళ